



# బిలం

సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి

కొం డపైకి ఏటవాలుగా సగం దూరం ఎక్కినాంక రెండు చింతమాన్ల మద్యనా బావురుమని తెరుచుకొన్న బిలం కన్పించగానే ఆశ్చర్యంతో కళ్లు విచ్చుకొన్నాయి రమణకు. ఆయాసంతో గుండెలు ఎగిసి పడుతోంటే చెట్టు మొదట్లోని అరుగుమీద కూచుని సేదదీరుతూ సైతం బిలంలోకి చూస్తూండిపోయాడు.

వెంట వచ్చినవాళ్లు కూడా అరుగుల మీద కూచున్నారు.

ఎన్నేళ్లనించి అనుకొంటున్నాడనీ బిలం చూడాలనీ, లోపలికి జొరబడాలనీ, నిచ్చెన్లు ఎక్కి రచ్చబండ రాగిమాను వద్దకు చేరుకోవాలనీ, మునీశ్వరులెవరన్నా లోపలుంటే మొక్కి రావాలనీ.

ఇన్నేండ్లకు తీరబోతోంది చిరకాల కోరిక. అదీ పెళ్లాం పుణ్యాన. కాదు కాదు... ఆవిడకు పట్టిన దెయ్యం పుణ్యాన.

గుహ ద్వారానికి ఇరువైపులు వున్న బండరాళ్లకు పసుపు కుంకుమలు అద్ది వున్నాయి. అక్కడక్కడా కొబ్బెర తిని పారేసిన టెంకాయ చిప్పలు పడున్నాయి.

తొలి సోమవారం వచ్చిన భక్తుల సందడికి ఆనవాళ్లు కాబోలు అవి. కార్తీక మాసపు నాలుగు సోమవారాలూ భక్తుల కలకలలతో బెలుంకొండ పరిసరాలు గలగలమని మురిసిపోతాయి.

"ఏం మునిసామీ! యాడ తావులేక యీ బిలంలో కూకున్నేవయ్యా? కొండ చీలడమేందీ, ఆ చీలికలోంచి ఆవు దూకి రావడమేందీ, నీకు పాలియ్యడమేందీ? మాకు మాత్రం యేటా యీ కొండలన్నీ ఎక్కి దిగి పానానికొస్తాందనుకో." గుహలోపలికి ఎలుగెత్తి అరిచాడు గోపాల్ అనే యువకుడు.

అందరికీ నవ్వొచ్చింది.

బిలం లోపల్నించి గాఢమైన చీకట్లు సుడులు దిరుగుతూ భయపెడుతున్నాయి.

కొండ చీలిక చూడాలనిపించింది రమణకు. రాత్రి పూట కుదరదు.

మెల్లిగా లేచి గుహద్వారం వద్దకు నడిచాడు.

లోపల్నించి కిరకిరల శబ్దాలు బిలం నిండుగా విన్పిస్తున్నాయి. వికృతంగా చెవుల సోకుతున్నాయి.

గబ్బిలాల అరుపులతో అవి.

ముఖద్వారం దాదాపు ఇరవై అడుగుల పొడవున, ఏడెనిమిది అడుగుల ఎత్తుతో ఎవరో శ్రద్ధగా మలచినట్లుగా బండపేట్లు అమరివున్నాయి.

బిలం లోపలికి అడుగుపెడుతూనే - ఎడమవైపు చెన్నరాయస్వామి, మరో బారెడు దూరంలో అక్క దేవతల శిలలు వున్నాయి. వాటిముందు పురాతన కాలంనాటి మట్టి ప్రమిద, రెండు మూడు గురిగలు వున్నాయి.

గోపాల్ అందరికీ గైడ్‌గా మారాడు.

దేవతా మూర్తులకు దండాలు పెట్టుకొని అతనివెంట కదిలారు అందరూ.

టార్చిలైట్ల వెలుతురు గుహ చీకట్ల లోపలికి ఎక్కువ దూరం చొచ్చుకు పోలేకుంది. గుహ పైకప్పుకు వేలాడుతున్న గబ్బిలాలు వెలుతురు సోకగానే లేచి అటు ఇటు తిరుగుతున్నాయి.

"జాగర్తన్నో! మొగాల మీంద తంతాయి. కనుగుడ్లు జాగర్త..." గోపాల్ హెచ్చరించాడు.

చెల్లాచెదరుగా పడివున్న పెద్దపెద్ద బండరాళ్ల మీదుగా ఒకరొకరుగా బిలం లోపలికి దిగిపోతున్నారు.

లోపలి గుహ చాలా విశాలంగా వుంది. వేలకొద్దీ జనం పట్టేంత విశాలం.

పైకప్పు మీంచి అక్కడొకటి నీటి బిందువులు రాలుతున్నాయి. ఒక్కోచోట కూచుని దిగాల్సివస్తోంది. ఒకర్నొకరు చేతి ఆసరా ఇచ్చుకోవాల్సి వస్తోంది.

ఉన్నట్టుండి గోపాల్ అరుపు, ''మునిసామిని సూడండి...'' అంటూ.

అతని టార్చి వెలుతురు పడిన తావుకు తమ టార్చి వెలుగుల్ని మళ్లించి చూశారు.

పుట్టలాగా పెరిగిన సున్నపురాయి. అవక్షేపపు శిలై వుండొచ్చు. పైభాగాన అచ్చు మునీశ్వరుని తలలాగే వుంది. పెరిగిన గడ్డం, కళ్లు, ముక్కు, నోరు, మీసాలు- పసుపు కుంకుమలతో పూజించబడిన తల....

పక్కనే దీపారాధన చేసే ప్రమిద. ఆముదము వున్న మట్టి గరగ... సగం కాలి ఆరిన ఊదుబత్తీలు... మరోవైపు సోనవానలో తడుస్తూ శివలింగం... ఆశ్చర్య మేసింది అందరికీ.

మరికొంత దిగింతర్వాత గుహలోకి చొచ్చుకు వస్తూ సన్నని వెలుతురు... అది క్రమేణా పైకి పెరిగి పోతూ... ఒక చీలికలాగా విచ్చుకుపోతూ... అవును... అక్కడ కొండ పైన్నించి కిందకు నిలువునా చీలి వుంది. కళ్లు మిరుమిట్లు గొలిపేలా ఆకాశపు తునక కన్పిస్తూ... కొండపైకి చెట్ల కొమ్మలు, వేలాడే వేర్లూ... 'ఓహ్... ఎంత అద్భుతంగా వుంది!' అన్పించింది.

మరో వింతయిన విషయం... చీలిక చివరలో వానకు తడవని పేట్ల కిందుగా నల్లగా జబజబలాడుతూ ఒకదానిమీద మరొకటి పాకుతూ వున్న అసంఖ్యాక గబ్బిలాలు మందలు మందలుగా కన్పించి ఒళ్లు జలద రించింది. రెప్పలు మూయడం కూడా మరిచారు.

అక్కణ్నించి గుహ మళ్లీ ఒక మనిషి పట్టేంత రంధ్రంతో ప్రారంభమవుతుందిట... టార్చి వెలుతుర్లో రంధ్రం కూడా కన్పిస్తోంది.

అందులో జొరబడాలనీ శోధించాలనీ రమణ కోరిక. చిన్నప్పట్నించీ బిలం గురించి ఏవేవో కథలు వింటున్నారు. అవి నిజమో కాదో తెలుసుకోవాలి. బిలం లోతెంతో కనుక్కోవాల.

గబ్బిలాలన్నీ గుహను వదలి వెళ్లింతర్వాత రాత్రి పూట చేయాల్సిన పని అది.

అందరూ వెనుదిరిగారు.

గుహ బైటకొచ్చి కొండ దిగారు.

లోయలో కొంత దూరం వెళ్లింతర్వాత మనుషుల గలగలలు విన్పించాయి.

చింతమాని బావివద్దకు చేరుకొనేసరికి వంటలో నిమగ్నమై కన్పించారు ఆడవాళ్లంతా.

అప్పటికే సాయంత్రం ఐదుగంటలు దాటింది.

వానమబ్బులు పైపైకి ఎక్కివస్తున్నాయి. చీకటి పడేవేళకు గాలివానగా కూడా మారొచ్చు.

ముందుగా నైవేద్యం వండించాడు- అక్కడ పూజలు పెట్టే యానాది లక్ష్మన్న.

తర్వాత ఉప్పుకారంతో వంటలు.

లోయలో వున్నారు కాబట్టి అప్పుడే పొద్దుగుంకిన అనుభూతి కలుగుతూ వుంది. తొందరగా బిలం చేరుకో వాలనే ఆదుర్దా ఒకటి అందరిలో జొరబడింది.

సుధ కేసి చూశాడు రమణ.

అదే జిడ్డు మొహం. అదే పరధ్యానం... కళ్లు లోతుకు పీక్కుపోయి... ఎప్పుడూ యీ లోకంలో లేనట్టే... ఏడాది కాలం నించీ ఇదే వరుస.

ఆవిడ జేజి వుండేదిట. గయ్యాళిగంప. దాని ప్రేతమే ఈవిడను ఆవహించిందని అందరూ అనుకోవటం.

చాలా హాస్పిటళ్లు తిప్పాడు. సైకియాట్రిస్టు వద్ద చూపించాడు. గుళ్లు గోపురాలు సందర్శించారు. ఎక్కడా నయం కాలేదు. ఇక్కడ ఖచ్చితంగా దెయ్యం వదలి పోతుందని చెబితే తీసుకొచ్చాడు.

నల్లమల్లకు అడ్డంగా ఇంతదూరం నడచి రావటం చాలా శ్రమ కలిగించింది. మొదటి సోమవారం యానాది పూజారులు వచ్చి పరిక్కంపను నరుక్కొంటూ దారి చేశారు గాబట్టి సరిపోయింది.

మబ్బులు కొండ కొన కొప్పుల పైకి ఎక్కి వస్తున్నాయి. నల్లగా కదలుతూ మీద దూకేట్టున్నాయి. ఉరుములు మెరుపుల్తో సందడి చేస్తున్నాయి. గాలి కూడా మొదలైనట్టుంది. దూరాన్నించి అది చెట్ల కొమ్మ లతో వాయించే హోరు శబ్దం సన్నగా విన్పిస్తోంది.

కుండా, చట్టీ, నీళ్ల బిందెలతో అందరూ బిలం దగ్గరకు చేరుకున్నారు. లోయలో యీవైపు నించి ఆ వైపుకు కొండకోళ్లు అందంగా ఎగురుతున్నాయి.

దూరాన్నించి నెమళ్ల క్రేంకారాలు విన్పిస్తున్నాయి.

అన్ని సవ్వడుల్నీ గాలి మింగేస్తూ వుంది.

దేవుళ్ల వద్ద దీపారాధన చేశారు.

అప్పటికే చీకటి కొండల్ని ఆక్రమించుకొంది.

ఆ సమయంలోనే గుహ లోపల ఏదో శబ్దం మొదలైంది. సరసరమనే కదలికల శబ్దం. జరజరమని పాకే సవ్వడి. బర్‌బర్‌మని దూసుకొచ్చే ధ్వని. ఆ సవ్వడి క్రమేణా పెరుగుతూ, లోలోపలే సుడులు దిరుగుతూ,

కొండవాలులోకి దూకే గాలిలా రొదజేస్తూ, మరింత విస్తరించి తుఫాను హోరులా మారి అందర్నీ దిగ్భ్రమకు గురిజేస్తూ గబ్బిలాల మందగా రూపాంతరం చెంది బైటకు రాసాగింది. దీపాలు ఆరిపోయేలా రెక్కలాడిస్తూ, జనాల్ని తాకుతూ బైటి చీకట్లలో కలిసిపోయాయి అవి.

రాత్రిళ్లయ్యేసరికి ఇంత పెద్ద అడవీ వాటి సామ్రాజ్యమవుతుంది.

తెల్లార్లూ యథేచ్ఛగా ఆహారాన్వేషణ చేస్తాయిట.

పది నిమిషాల తర్వాత, చివరి గబ్బిలం కూడా చీకట్లను చీల్చుకొంటూ బైటకెళ్లిన తర్వాత గుహలోపలికి వెళ్లేందుకు అందర్నీ సంసిద్ధపరచసాగాడు గోపాల్.

మరోవైపు పూజారి లక్ష్మన్న కూడా తన పనిలో తానున్నాడు. పిల్లల ఫలాలకు మొక్కొనే వాళ్లకు వరప డేందుకూ, దయ్యాలు వదిలించుకొనేందుకు వచ్చిన వాళ్లను అక్కదేవతల పూజకూ, కోర్కెలు నెరవేరిన వాళ్లను మొక్కుబడి తీర్చేందుకూ సిద్ధం కమ్మంటూ ఆజ్ఞలు జారీ చేస్తున్నాడు.

గుడ్డ పేలికలతో కాలి బొటనవ్రేలి లావున జడలా అల్లిన వత్తుల్ని ఆముదంలో నానేసి, మూరెడు పొడవున్న పంగలకర్రకు చుట్టి, దాని కొసను పంగల్లో వదలి, అంటించి, మనిషికొక దీపపుకర్రతో సిద్ధమైనారు. యువకులంతా.

రమణతోటి మరో ఇద్దరి వద్ద సెర్చిలైట్లు వున్నాయి.

అందరూ బట్టలు వదిలేసి డ్రాయర్లమీదున్నారు.

పూజలకు సంబంధం లేని ఆడవాళ్లు కూడా సిద్ధ మయ్యారు నిచ్చెన్లదాకా అయినా వెళ్లి బిలం శివయ్యకూ, మునెయ్య పావుకోళ్లనూ మొక్కి రావాలని.

పిల్లల ఫలాల కొచ్చిన ఆడవాళ్లు కూడా లోపలికి వచ్చేందుకు మొగ్గుజూపారు పూజారి అనుమతితో. తిరిగి వచ్చింతర్వాత వరపడతామన్నారు.

భార్యకేసి చూశాడు రమణ.

ఆమె జడ విప్పి వెంట్రుకలు చిక్కుదీస్తున్నారు. వెంట వచ్చిన స్త్రీలు. చన్నీటి స్నానం చేయించి పూజలో కూచోబెడతారు కాబోలు. బైట సన్నగా రాలే పుల్లజినుకు లకు ఈదురుగాలులు తోడై చలి ఎక్కువైంది. ఈ చలిలో... తడిసిన బట్టలతో గజగజ వణుకుతూ, గంటల తరబడి తల వూపుతూ... దయ్యం పూనేదాకా వూగా ల్సిందే... ఖర్మ...

అదంతా తను చూడకుంటేనే బావుంటుందను కొన్నాడు రమణ.

అంటించిన దీపపు కర్రలతో యాభైమందికి పైగా జనం బిలం లోపలికి వెళుతూవుంటే- రాత్రిపూట పరాయి కోటను పట్టుకొనేందుకు వెళ్లే దండయాత్రలా వుంది. ఆ దృశ్యం రమణకు కొంత భయాన్నీ, మరికొంత ఉత్సాహాన్నీ, ఇంకొంత కొత్తదనాన్నీ రగిలిస్తూ వుండగా బండరాళ్ల మీద జాగ్రత్తగా అడుగులేస్తున్నాడు.

"లచ్చుమన్నా! మా గుడ్డలు జాగర్త. యిడిపించిన దెయ్యాలకు తొడిగి పంపేవు. మేమిక్కడే భజన తొక్కా ల్సొస్తది..." గోపాల్ కేకేశాడు.

ఓవైపు నవ్వుకొంటూనే మరోవైపు భయంతో ముని స్వామికి గోవిందలు కొడుతూ లోపలికి నడుస్తున్నారు జనం.

ఆముదపు దీపాలు గుహ చీకట్లను ఏమాత్రం తరమలేకపోతున్నాయి. తమ చుట్టూ నాలుగైదు గజాల మేర కాంతిని చిమ్మి అన్నీ కలిసి ఒక వెలుతురు గుడారాన్ని సృష్టిస్తున్నాయి.

పిల్లల ఫలాల కోసం వచ్చిన ఆడవాళ్లను యువ కులు కొందరు రాళ్ల మీద జాగ్రత్తగా దింపుతున్నారు వాళ్లు కూడా ప్రతి చిన్న దిగుడుకూ తమకు తోడుగా వున్న యువకుని ఆసరా తీసుకుంటున్నారు. ఆ విష యాన్ని కూడా వ్యంగ్యంగా వ్యాఖ్యానిస్తున్నాడు గోపాల్.

కొండ చీలికదాకా వున్న విశాలభాగాన్ని దాటగానే, మనిషి దూరేంత కంత మాత్రం కన్పించింది. కష్టపడి వొంగుని కంతలో దూరగానే గుహ మళ్లీ విశాలమైంది. వెనక్కి తిరిగి ఆ కంతకేసి చూస్తే- ఆ కొద్దిపాటి కంత విరగబడి దారి మూసుకుపోతే ఎట్లా అనే భావం ఎదలో కదలాడి గుండె జల్లుమంది. ఆ కంత వద్దే గోపాల్ వ్యంగ్య బాణం విసిరాడు, "ఇద్దరిద్దరు కంతలో పట్టరు. ఒక్కొక్కరే రండి. మాసికి మాసికి రొవ్వంత ఎడంగా వుండండిబ్బా! ఉక్కకు సస్చారు..." అని.

ముసి ముసి నవ్వులతో జంటలు విడిపోయాయి.

రాశులు రాశులుగా పడివున్న బండరాళ్లమీద జాగ్రత్తగా అడుగులేస్తూ, మునిస్వామికీ, బిలం చెంద్రా యునికీ గోవిందలు కొడుతూ కదలుతున్నారు జనం.

బైటవున్న భార్య గుర్తొచ్చింది రమణకు. తనను కూడా తెచ్చింటే బావుండేదేమో! వచ్చినా... మౌనంగా, మట్టిముద్దలా ఉండేది కాబోలు.

పెళ్లయిన కొత్తలో ఎంత హుషారుగా వుండేదనీ! నవ్వుల జలపాతంలా, పూసిన మందారంలా... మెడ నిండా సొమ్ములు పెట్టుకొని నిండా పూతలతో నిలు చున్న కందిచెట్టులా... తనకు ఎమ్మార్వో ఆఫీసులో క్లర్క్ పోస్ట్ కాబట్టి మామగారు దండిగానే కట్నం ఇచ్చారు.

అంతా బంగారం రూపంలోనే. తన పెళ్లి సమయానికి లెక్కబిసతో బిర్రుగానే ఉండేవాడు ఆయన. తర్వాతనే ఒక్కసారిగా దెబ్బతిన్నాడు. పసపు కొమ్ముల వ్యాపారం లోనే పదిలక్షల నష్టం వచ్చిందట. వడ్లకయితే చెప్పాల్సిన పన్లేదు. గోడౌన్లలో స్టాకున్న వాటిని ఎట్లా వదిలించుకో వాలో అర్థంగాక అయినకాడికి అమ్మితే అందులోనూ భారీగా నష్టమట. రెండేండ్లకే పరిస్థితులు తిరిగబడ్డాయి. కూతురి వొంటిమీది బంగారమంతా కుదువబెట్టి అప్పులు తీర్చుకొన్నాడుట. ఇంకా ఏవేవో తంటాలు పడ్డా డుట. తనకా విషయం ఆలస్యంగా తెలిసింది. అమ్మా నాన్నలకు తెలీకుండా వుండుంటే బావుండేది. చిన్నాన్న కొడుకు పెళ్లి సందర్భంగా బైటబడింది. సుధ మెడలో నగలు లేకపోవటంతో ప్రశ్నించారు. 'అమ్మగారింటి వద్ద ఉన్నా'యంది. 'పెండ్లికి లేకుంటే ఎట్లా! తెచ్చుకో' మన్నాడు. తప్పలేదు ఆమెకు. ఊరికి వెళ్లి అడిగింది. ఒక్కసారిగా అంత డబ్బు కట్టి విడిపించుకోవటం వాళ్లకు సాధ్యపళ్లేదు. అమ్మానాన్నలు కోప్పడ్డారు. నగలు లేకపో వటంతో పెళ్లికి వెళ్లటం చాలించుకొంది సుధ. పెండ్లిం టిలో ఆ విషయం చర్చకు వచ్చింది. ఆడవాళ్లు కొందరు సుధను మందలించారు. పెండ్లికి కూడా రానీకుండా చేసిన ఆమె నాన్నను దూషించారు. వాళ్లల్లో అమ్మ కూడా వుంది. తను ఏమీ మాట్లాడలేకపోయాడు.

అదిగో... అప్పుడు వెళ్లిపోయింది ఆమె పుట్టింటికి.

నెలరోజులకు ఆమె తల్లి మరణించిందని తెలిసి తనూ వెళ్లాడు. చూసి వచ్చాడు. ఆమె చావు మీద ఏవో అనుమానాలు... ఆత్మహత్యగా గుసగుసలు.

మరో నెలనాళ్లకు సొమ్ములతో సహా ఇంటి కొచ్చింది సుధ. మూటగట్టి తెచ్చి నాన్నకిచ్చింది.

ఆయన బీరువాలో దాచుకొన్నాడు.

"సార్! పెద్ద లైటున్నోనివి. ఎనకబడ్తే ఎట్లా? గొర్ల మందలో మేకపోతట్లా దారిజాపాలగాని... రా... రా..." గోపాల్ కేకేశాడు. ఆలోచనల్ని విదిల్చికొంటూ బిరబిర అతని వద్దకు నడిచాడు రమణ.

పెద్ద హాలులాంటి తావులో ఆగిపోయి వున్నారు అందరూ.

సెర్చిలైట్లతో చూస్తే చాలా ఎత్తుగా వుంది అక్కడ.

పదిహేను అడుగుల ఎత్తులో మరో అంతస్తు వుంది. అక్కడిదాకా పెద్దపెద్ద కొయ్యలతో నిచ్చెనలు ఏర్పాటు చేశారు.

హాలుకు ఎడమ వైపున మనిషి నిలబడి నడిచేంత పెద్ద బిలాలు రెండు కన్పించాయి. సెర్చిలైటుతో ఒక దానిలో దూరితో తిరిగి రెండవ రంధ్రం గుండా అక్కడికే వచ్చారు.

గుహను శోధించాలనుకొన్నవారు నిచ్చెనలు ఎక్కి పైకి వెళ్లక తప్పదు.

ఆడవాళ్లంతా అక్కణ్నుంచి వెనుదిరిగారు. వాళ్ల తోటి చాలామంది మగవాళ్లు కూడా. చివరకు ఆరు మంది మాత్రం మిగిలారు. వాళ్లు కూడా వెనక తొక్కులు తొక్కుతూ వుంటే రమణ చెప్పాడు, "అన్నీ చూసినవాడు గోపాల్ ఉన్నాడు గదా! భయమెందుకు?" అని.

"రాండి రాండి..." అంటూ బిరబిర నిచ్చెన ఎక్క బోయి ఓ మెట్టుమీంచి జారి వేలాడాడు గోపాల్. అందరి నవ్వుల మధ్య తిరిగి ప్రయత్నించి పై అంతస్తుకు చేరుకొన్నాడు. నిచ్చెనల నిండా పిట్టపెంటతో జిడ్డుగా మారి జారిపోతూ వుంది. పగటిపూట వచ్చుంటే ఇక్క డంతా గబ్బిలాలే వుండేవి.

ఒకొరొకరే అందరూ పైకి చేరుకొన్న తర్వాత "ఎట్లా పోవాల?" అడిగాడు రమణ.

పకపక నవ్వాడు గోపాల్. "మంచి మంచి మొగో ల్లంతా వచ్చేది ఇక్కడి దాకానే.. యీ మొగోడు కూడా అంతే..." అన్నాడు. "మీరు సరేనంటే నేను రెడీ... సావ నేది రోజూ రాదుగదా! అయినా మనందరి కంటే విలు వైన పానం సారుది. ఆయనకు లేని బయ్యం మన కెందుకూ...?" అన్నాడు గోపాల్.

"నేనూ రెడీ! బిలం లోతు సూడాల్సిందే. దీని అంతు కనుక్కోవాల్సిందే," రమణ చెప్పాడు దృఢంగా.

" హో హో " అంటూ శబ్దం చేశాడు గోపాల్. మరెవరో గట్టిగా ఈలేశారు గుహ మర్మోగేలా.

ఆ హుషారుతో అంతో యింతో అంటుకొని వున్న భయం జల్లున జారిపోయింది మిగతా వాళ్లకు.

దారి బట్టారు. ముందు గోపాల్... వెనుక రమణ.

మనిషి పట్టేంత కంతలూ, జిడ్డోడుతూ చెమ్మ వూరుతూ ఇనుప రజనులాంటి మట్టీ, బోర్లా పడుకొని పాకే రంధ్రాలూ, ఒక్కోచోట మనిషి భుజాలపై కెక్కి పై రంధ్రాన్ని చేరుకోవటం, కింది వాళ్లను చేదుకోవటం,... అక్కడక్కడా ఉన్నట్టుండి ఐదారు నిలువుల సొరంగం...

ముందుకు వెళ్లేకొద్దీ అలివిగాని ఉక్కపోత. శరీర మంతా చెమటల ఊట... ఒళ్లంతా జిడ్డుమట్టి పూత... నుదుటి చెమట తుడుచుకొనేందుక్కూడా లేదు. ముంజేతినిండా మట్టి... బట్టల్లేవు గాబట్టి సరిపోయింది. వెనక్కి పోదామని కొందరి ప్రతిపాదన. పురుగో పుట్రో ఉంటాయేమో! పెద్ద పెద్ద కొండచిలువలుంటాయేమో!

"యీ ఉక్కకు ఏ జీవీ బతకదు. మన చేతిలో లైట్లు ఫెయిలయితే ఏ దిక్కుపొయ్యేది తెలీక మనకై మనం సావాల తప్ప..." గోపాల్ చెప్పాడు.

అతను చెప్పిన దృశ్యం కొంత క్లిష్టమైందే. దాన్ని వూహించుకొని, అందులోని వాస్తవాన్ని అర్థం చేసికొనే సరికి ముచ్చెమటలు పోశాయి అందరికీ.

''సావడానికి యింగో అవకాశం కూడా వుంది. తగిల్తే రాలిపోయే మట్టి, సన్నసన్న గోడల మీద నిలబన్నె కప్పు... యీ కప్పు నుంచీ రాలు యాలబడి వుండాయి సూడండీ... బిలం కప్పు ఇట్లనే కదిబడిందనుకో... మనం దరికీ ఒకటే గోరి''.

''ఒరే ఒరీ... అది నోరా? జాలాడిగుంతా? రవ్వంతసేపన్నా మూసుకోనుండలేవా?'' భయం ఎక్కువైన జయరాముడు అన్నాడు.

''ఏం జెయ్యాల జయరామన్నా! నోటి బిస ఎక్కువైంది. మూత వుండె... దావనబొయ్యే వాల్లను పేరుబెట్టి పిల్చి మరీ నోటి జిల తీర్చుకుంటాండె. పనుందని పోబోయిన పోనీడే. 'ఏంబా! మెత్తబన్నెట్టుండావే,' అని ఎవురన్నా అంటే 'ఏముంది నాయినా మెత్తబడక? సిన్నప్పుడు కాల్లకు బలం. వొగిసిన నడుముకు బలం, ఇదో యీ ముసిలి ముప్పన నోటికి బలం... వొల్లులో యాడా సత్తవ లేదు- నోటి బిస తప్ప' అంటాండె. నాకేందో ముసిలి ముప్పున రావాల్సిన నోటి బిస ఇప్పుడే వొచ్చింది...'' అన్నాడు గోపాల్. అందరూ నవ్వారు.

మరికొంత దూరం అవస్థలు పడింతర్వాత, వున్నట్టుండి... వాకిలి దాటుకొని హాల్లోకి వెళ్లినట్లుగా విశాలమైన ప్రదేశంలోకి ప్రవేశించారు. ఆ తావు చాలా వింతగా వుంది. సెర్చిలైట్ల వెలుతుల్లో తలెత్తి చూస్తే నలబై యాబై మూరల ఎత్తున్నట్లుగా అన్పించింది. క్రింది విశాలం పోనుపోను తగ్గుతూ పైకి వెళ్లేసరికి గుడిసె కప్పులా మారింది. గోపురంలాగా గొర్రె పిల్లల గూడులాగా వున్న ఆ తావు భయాన్ని కలిగించింది.

ఇంకో విచిత్రం ఏమిటంటే- ఖచ్చితంగా హాలు మధ్యగా ఆరడుగుల పొడవు, రెండడుగుల వెడల్పు, నాలుగడుగుల ఎత్తులో అరుగులాంటి నిర్మాణం వుంది. అదో పెద్ద బండరాయి కావొచ్చు. అయితే ఖచ్చితంగా కొలతలు పెట్టి కత్తిరించినట్లుగా వుంది. అరుగుపైన ఓవైపు- అది ఏ దిశ అయిందీ అర్థం కాలేదు -పాదుకలాంటి రాయో. నంది ఆకారమో అమర్చి వుంది.

సెర్చిలైట్లు ఆపేసి చూస్తే, ఆముదపు వత్తుల వెలుగు కొంతదూరం మాత్రమే వ్యాపించి, పై మబ్బు చెట్టు గుబురులా తోచి, నా చిన్నతనాన్నించి జనం చెప్పుకొనే 'రచ్చబండ-రావిచెట్టు' ఇదే కాబోలు అనిపించింది రమణకు.

ముప్పై అడుగుల పైభాగాన ఏటవాలు గోడల్లోంచి పెద్ద పెద్ద రాతిపేట్లు ముందుకు పొడుచుకొచ్చి వున్నాయి. వాటిపైన కూడా బిలాలు కన్పిస్తున్నాయి. అంత ఎత్తు ఎక్కి ఆ బిలాల్లో జొరబడగలిగితే ఆదారి మరెక్కడకు తెరచుకొంటుందో వూహకందని విషయం.

ఇక అక్కడ ఉండటం ఏమాత్రం మంచిది కాదని అందరూ వెనుదిరిగారు.

కష్టాలు పడ్డా ఏదో ఆనందం. బిలం లోతు కనిపెట్టామనే గర్వంతో కూడిన సంతోషం.

''అబ్బీ గోపాల్! నీకు పెండ్లయిందా?'' రమణ అడిగాడు.

''అయింది సార్! ఇద్దరు పిల్లోల్లు... మునిశేఖర్, మునిలక్ష్మి...''

''యీ బెలుం మునిస్వామి పున్నెమేనన్నమాట...''

''అవ్‌సార్! అందుకే ప్రతియేటా వచ్చేది... ఇంతకూ నువ్వేం మొక్కుబడితో వొచ్చినవు సారూ?''

''మా భార్యకు దెయ్యం పట్టిందయ్యా!''

''అత్తగారింటి దెయ్యమా! అమ్మగారింటి దెయ్యమా!'' వెంటనే అన్నాడు.

అర్థం కాలేదు రమణకు.

''అత్తగారింటి దెయ్యమయితే- సొమ్ములకో, సీరెలకో, అత్త ఆడబిడ్డల పోడు బల్లేకనో ఇంటి కోడలు ఇబ్బంది బడ్తాండే వొల్లులో జొరబడ్తాదిలే. అమ్మగారింటి దెయ్యమయితే పుట్టింటి వాల్ల కష్టాల్జూల్లేక ఏదైన్నా సాయం జేపించుకోడానికి ఆ ఇంటి దెయ్యం వొచ్చి పడ్తాది. మీ భార్యకు పట్టింది ఏ దెయ్యమో తెలుసుకోలేదా?

''పుట్టింటి దెయ్యమే,'' చెప్పాడు.

''నా పెండ్లానికీ ఒకసారి అమ్మగారింటి దెయ్యం పట్టిందిలే సార్...'' అంటూ గోపాల్ ఎత్తుకొన్నాడు. ''మా మామగాడుండాడు. పీనాసినాకొడుకు. పెండ్లికి రొండు తులాల బంగారం బెట్టిండు. ఇరవైవేల కట్నం ఒప్పుకొని పెండ్లి కాగానే ఎగరగొట్టిండు. ఏడాదైంది. రొండేండ్ల యింది. ఎంతడిగినా లేదంటడే... అప్పుడే నా వలపడెద్దు పురుగు కుట్టి చచ్చింది. మంచి ఎద్దుసార్... మల్లెపువ్వాల వుండె... కాడికి జత లేదు. ఇంగొక దాన్ని తెచ్చుకొందామా అంటే చేతిలో లెక్కలేదు. వాల్లు వీల్లు చెప్పంగ మామ కాడికి పోయినా. కట్నం లెక్క అడిగినా... పలకలే... గట్టిగా అడిగినా. 'నీకు పిల్లనిచ్చిందే గొప్ప' అన్నెడు. పెద్దమాసులు చెప్పినా యిన్లే... యీనికిట్టా కాదులే అనుకొన్నే. పైనబడి రెండు తన్నులు తన్నినా. వానెద్దును పగ్గం విప్పి ఇంటికి తోలకొచ్చుకొన్నే. సంగతి విని

ఏడ్చింది నా పెండ్లాం. పూరికి పొయ్యొచ్చింది. నేనా ఎద్దును కాడిగట్టేప్పుడల్లా నా పెండ్లానికి దెయ్యం పడ్తుండె... మల్లా యేడాదికి మా మామగాని పూర్లపక్క పాపిష్టి కరువొచ్చె. తిండి గింజలు కూడా పండలే. తనఖా బ్యాంకోల్లొచ్చి మామ ఇంటిని జప్తు చేస్తాండరని తెల్సింది. నాకప్పుడే సెనక్కాయలు పండిండె. రేటు కూడా పల్లే... బేరగాల్లు అడిగిన కాడికి ఇచ్చి మా మామ గాని అప్పు గట్టి వొచ్చినా. ఆపైన నా పెండ్లానికెప్పుడూ దయ్యం పట్టలే..."

అందర్నీ ఆకట్టుకొంది అతని కథ.

పిల్లనిచ్చిన మామను వాడు, గాడు, నాకొడుకని తిట్టటం చాలా అనాగరీకంగా అనిపించింది రమణకు. మామను కొట్టిన విషయాన్ని అదేదో పెద్ద సాహసంగా చెప్పుకోవటం నచ్చలేదు. కానీ చివరి చర్యతో అతనిలోని అద్భుతమైన మానవీయత బైటబడి ఆశ్చర్యపోయాడు. కొట్టిన విషయాన్నీ, సాయం చేసిన విషయాన్నీ ఒకే విధం గా, అతి సహజంగా చెప్పటం వింతగా అన్పించింది.

వెనుదిరిగిన దారిలో ఓ చోట శివలింగం, మరో చోట చెక్క పాదుకలు దర్శనమిచ్చాయి. సన్నబిలం కూడా వదలకుండా శోధిస్తూ వెళ్లసాగారు.

భార్య విషయం గుర్తొచ్చింది రమణకు.

బంగారం తెచ్చిన తర్వాత తను పుట్టింటికి పోతా నని ఎప్పుడూ అడగలేదు ఆమె. తను కూడా చెప్పలేదు. పుట్టింటి నుంచి కూడా ఎవ్వరూ రావటం లేదు. అయిన వాళ్లతో ఆర్థిక లావాదేవీలు కూడదంటారు. ఇందుకే కాబోలు.

నిరుడు పెదనాన్న కూతురి పెళ్లి సందర్భంలో అనుకొంటా- సుధ ఎంతకూ ప్రయాణం కాలేదు. అమ్మ నాన్నలు విసుక్కొంటే స్నానం చేసి బట్టలు మార్చుకొంది. సొమ్ములు తెచ్చిస్తే పెట్టుకోలేదు. నాన్న మందలిస్తే వేసు కొంది. అంతా ఇష్టంలేని విధంగానే... వెహికల్ ఎక్కి కొంత దూరం వెళ్లేసరికి దెయ్యం పూనింది. అంతా రసాభాస...

మళ్లీ ఇంకో పెళ్లికి... ఏదో పండక్కి... బావ గారింట్లో వ్రతానికి. మంత్రగాడు దెయ్యమన్నాడు. ఆమె జేజి ఆత్మ పూనిందట.

సైకాలజిస్టు ఏమీ తేల్చలేకపోయాడు.

దేవాలయాలూ, దర్గాలూ దయ్యాన్ని వెళ్లగొట్టలేక పోయాయి. ఆఖరుకు ఇదో యీ మార్మిక ప్రదేశంలోని నమ్మకమే దిక్కయింది.

కొండ చీలిక వద్దకు వెళ్లేసరికి చల్లని గాలి సోకింది. వాన తుంపర్లు కూడా మీద రాలాయి. ముఖ ద్వారం వద్ద చల్లదనం ఆహ్లాదంగా అన్పించింది.

బైటనించి వానమోత విన్పిస్తూ వుంది.

పూజారి ముందు ఆడవాళ్లంతా నేలమీద వాలి వున్నారు.

సుధ ఇంకా తలవూపుతూ వుంది. దెయ్యం ఆవ హించలేదు కాబోలు.

లక్ష్మన్న పిలుస్తున్నాడు. రమ్మంటున్నాడు. కోరిక తీరుస్తామంటున్నాడు.

"ఏం లచ్చుమన్నా! యాడుందెంట ఆమె జేజి? ఈ గాలివానకు ఇంతదూరం యాడొస్పాదితీ ఆ ముసిల్ది," అన్నాడు గోపాల్.

వచ్చే నవ్వును బిగబట్టుకొన్నారు కొందరు.

'పండగలకో పబ్బాలకో పెండ్లిండ్లకో పేరంటాలకో అయితే చెప్పాపెట్టకుండా వస్తది.' కసిగా అనుకొన్నాడు రమణ. 'సొమ్ములు దిగేస్తేగద వొచ్చేది'.

ఉన్నట్టుండి అతనికో అనుమానం వచ్చింది. అవును... సొమ్ములు దిగేసుకొన్న ప్రతిసారీ ఆమెను దెయ్యం వూనింది. అంటే... సొమ్ములకూ... దెయ్యానికీ...

సుధ మూలగటం మొదలెట్టింది... వికృతమైన మూలుగు. కొంతసేపు మూలిగింతర్వాత, సాంబ్రాణి పొగ పెంచుతూ, "ఎవరు నువ్వు?" అడిగాడు లక్ష్మన్న.

రెండవసారి అడిగిన తర్వాత చెప్పింది, "అచ్చెమ్మను," అని.

సుధ జేజి పేరు అదే.

"ఎందుకొచ్చినావు?" అడిగాడు.

"రమ్మంటివే..." గొంతునిండా గడుసుదనం.

"ఇప్పుడు నేను రమ్మంటే వొచ్చినవు. బాగుంది. రోజూ నీ మనమరాలి వొల్లులేకి వస్పాండవంటనే. ఎవురు రమ్మన్నెరూ?"

"సూసి పోదామని..."

"రోజూ సూడాల్నా?"

"రోజూ ఎప్పుడూ?... సొమ్ములేసుకున్నెప్పుడే. సూడ్డానికి రొండు కండ్లు సాలవనుకో..."

"ముసిల్దానివి. వొగిసి ఆడమాసి వొల్లులో దూరు కొంటే వాల్ల సంసారం ఏం గావాల? బండలైపోదూ!"

"అయితే ఏందిబ్బీ నువ్వనేది?"

"నువ్వీ ఆడకూతుర్ని యిడ్చిపెట్టి పోవాల-"

"నేనెందుకు పోతా. నా మనమరాలు గాదూ..."

"నీకేమన్నా కోరికెలుంటే సెప్పు. తీర్చుకొని పోదూ గాని..."

''నువ్వు దీరుస్తావా?''

''ఎవురోకరు తీరుస్తార్లే...సెప్పు...''

''వొళ్లంతా బంగారం దిగేసుకొని పోవాల నుంది...''

''దిగేస్కే పోతావా?''

''పెండ్లి బంగారంతా పెడ్తే ఎత్తకపోతా...''

''బంగారెత్తక పోతావా? యాడికి?''

''మా వూరి బాయిలో వెయ్యడానికి...''

''ఓసి నియ్యమ్మ కడుపుగాల... ఇదేం కోరిక? నువ్వు మంచిగా పొయ్యేట్టు లేవే''

''ఏం రోయ్! మాటమారిందే?''

''మాటగాదు. అన్నీ మార్తాయి. ఇంతకు ముందే నీమీంద గండి ఆంజనేయసామికి రిపోర్టిచ్చినా. నీ సంగతి సూడాలని ఆయన పయనమైండు''

''ఓ యబ్బో... గండి యాడికి చానా దూరముంది లేబ్బీ!''

''గాల్లో ఎగిరొచ్చే దేవుడు ఆయన... శాకినీ డాకినీ ప్రేత పిశాచాలన్నీ ఆ సామి గాలిసోకితే పరారు కావాల్సిందే. నువ్వెంత ముసిలిముండవు. వొచ్చిండంటే కుతికె మీద కాలేసి తొక్కుతాడు...'' చెప్పాడు. చిటికెలు వాయిస్తూ పాట ఎత్తుకొన్నాడు. ఆంజనేయస్వామి రాకను పాటలా పాడుతున్నాడు. మైదుకూరు వచ్చిండనీ, వనిపెంట దాటిండనీ, వంకమర్రి డ్యాంమీద ఎగురు తండాడనీ, పోరుమామిళ్లకు చేరుకొన్నాడనీ, నరసాపురం, వరికుంట్ల మీదుగా వేగంగా దూసుకొస్తున్నాడనీ...

''గాల్లో వచ్చేవానికి రోడ్డు మార్గాలెందుకు సార్? ఆంజనేయసామిని తార్రోడ్డు మీదుగా తెస్తాండడే- కారేమన్నా మాట్లాన్నెడా?'' గోపాల్ వ్యాఖ్యానానికి కిసుక్కు నవ్వారు అందరూ.

యానాది లక్ష్మన్న పాట కొనసాగుతూ వుంది. సావిసెట్టి పల్లెకొచ్చి, కొండల్లో అడుగుపెట్టి, దోన్లపాయ దాటి, ఆ కొండ దాటి యీ కొండదాటి... కొండల పేర్లన్నీ చెబుతున్నాడు. ఆ కొండమీంచి దూకెనంటున్నాడు. ఈ కొండమీంచి ఎగిరెనంటున్నాడు. దెయ్యాన్ని బాగా బెదరగొడుతున్నాడు. బిలం కొండ పక్కగా వచ్చెనంటున్నాడు. అదిగో కాలు అంటున్నాడు. ఇదిగో తోక అంటున్నాడు.

ఉన్నట్టుండి పెద్ద మెరుపు మెరిసి ఉరుము ఉరిమింది.

''అదిగో వచ్చి కొండమీద దూకె,'' అంటూ గట్టిగా అరిచాడు.

దయ్యం బెదిరి పారిపోయింది.

సుధ నేలమీద వాలింది.

''నువ్వెట్టా పాపంగొట్టుకొని పోతావుపో...'' గోపాల్ అన్నాడు. ''ముసిల్దనే కనికరం కూడా లేకుండా ఇంత చలిలో, ఈ వానగాలికి బైటికి తరుముతావా?'' అనగానే మళ్లీ నవ్వులు కురిశాయి.

రమణ ఏదో ఆలోచనల్లో పడిపోయాడు. బంగారం గురించిన ఆలోచన... దయ్యం కోరుకున్న బంగారం గురించిన ఆలోచన.

సొమ్ములు వొంటిమీద వేసికొన్నపుడంతా ఆమెను దయ్యం పూనింది.

తాము కూడా సొమ్ముల్ని బలవంతంగానే తెప్పించారు. వాళ్ల ఆర్థిక ఇబ్బందుల్ని పట్టించుకోకుండా తాకట్టునించి విడిపించుకొచ్చేలా చేశారు. కూతురి ఏడుపు చూడ లేక, తనవాళ్ల లేమిడి చూల్లేక, ఆ సొమ్ముల్లోనే కూతురి సంసారం నాశనమైందనే బాధతో ఆమె తల్లి ఆత్మహత్య చేసుకోనుంటుంది. అదే జరిగి వుండొచ్చు... ఆ సంఘటనతో షాకయి ఎన్ని కష్టాలు పడాల్నో అన్ని పడి సొమ్ములు విడిపించినట్లుంది వాళ్లు... అట్లనీ... ఆ బంగారంతో తమకేమీ పన్లేదు- ఏవో శుభకార్యాలకు ఆమె మెడలో వేయటం తప్ప- ఎప్పుడూ బీరువాలోంచి తీసింది లేదు.

ఇప్పుడర్థమవుతూ వుంది- ఆమెకెందుకు దెయ్యం పట్టిందో.

బిలం లాగే ఇన్నాళ్లూ చీకటిగా కన్పించిన ఆమె అంతరంగం ఇప్పుడు తెలుస్తూ వుంది.

అనాగరికమయితేనేం, అత్యంత మొరటుదనమయితేనేం- గోపాల్‌లాగా కూడా తను వ్యవహరించలేక పోయాడు.

*పాలపిట్ట, డిసెంబర్ 2012*

